నిజానిజాలు

"ఈ సంగతి విన్నారటండీ?"

"ఏమిటిది?"

"ఒక మనిషి చెబుతున్నమాట నిజమో, అబద్ధమో తేల్చి వేయడానికి అమెరికాలో ఒక యంత్రం కనిపెట్టబోతున్నారట!"

పరుగెడుతున్న బస్సులో, దిగజార్చిన పరదాలకు నడుమ మెత్తని సుఖాసనాలపై మాగన్నుగా వున్న ప్రయాణీకులు కొందరు ఉలికిబడి కళ్ళు తెరిచేశారు.

"అది వార్తా, కాకపోతే ఊహాగానమా?" అని ప్రశ్నించాను.

"వార్తేనండీ! క్రయిమ్ చిత్రాలు, డిటెక్టివ్ నవలలు తామరతంపరగా అభివృద్ధి చెందుతూ వుండడం వల్ల సంఘంలో నేరస్థుల సంఖ్య మితిమీరి పోతోందట! వారి వారి మాటల్నిబట్టి, వారు దొంగో, దొరో తేల్చివేయడానికి అనువుగా విజ్ఞాన శాస్త్రజ్ఞులు ఈ యంత్రాన్ని కనిపెట్టడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారట!"

ఈ వార్తపైన ఓ తలనెరసిన వృద్ధుడు వ్యాఖ్యానం ప్రారంభించాడు:

"ఉప్పూ కప్పూరంలాగే మంచీ, చెడ్డా, సత్యమూ, అసత్యమూ బాహ్య దృష్టికి ఒక్క మాదిరిగానే గోచరిస్తున్నాయి. వాటి తారతమ్యాన్ని గూడా యంత్రాలే నిర్ణయింపగలిగితే అంతకన్నా కావలసిందేమీలేదు. అప్పుడిక కోర్టులు వకాలతులు విచారణలు బొత్తిగా అనవసరం!"

ఈ లోకజ్ఞుడి మాటల్ని మననం చేసుకుంటూ మళ్ళీ కళ్లు మూసుకున్నాను. ఉదయం కానూకానూ రోడ్డులో రాకపోకల సందడి హెచ్చవుతున్నందువల్ల బస్సువేగం మందగిస్తోంది. కునుకు పట్టనూ పట్టనూ నా మనో వీథిలో ఏవేవో దృశ్యాలు రేఖా చిత్రాలకుమల్లే ద్యోతక మౌతున్నాయి. పెద్ద పెద్ద రైల్వే స్టేషన్లలో జనం నడయాడే చోట గోడకు వ్రేలాడే పటం ఒకటి నాకప్పుడు జ్ఞప్తికి వచ్చింది. 'దొంగలున్నారు జాగ్రత్త' అన్న హెచ్చరికకు అది రూపకల్పనైతే గావచ్చు. దొంగలుగా పేరుమోసిన వారి ఛాయా చిత్రాల్లో నుంచీ తలలు మాత్రం కత్తిరించి ఆ పటంలో పునర్ముద్రించడం జరిగింది. వీడు దొంగ అని నుదుట వ్రాసి పెట్టకపోయినా అందులో ప్రతివాడూ మన ఉద్దేశంలో దొంగగానే భాసిస్తాడు. ఇందుకు కారణమేమిటో అని వితర్కించుకున్నట్లయితే చెదిరిన క్రాపింగు, చిట్లించుకున్న నుదురు, కనుముకుల తీరు - యివన్నీ వాడి ఆంతర్యాన్ని చూపరులకు చెప్పకనే చెప్పేస్తున్నాయేమోనని మనం అనుకోక తీరదు. ఆ ముఖాన్ని మనం వెయ్యిమందిలో చూచినా పోల్చుకోవచ్చు. అపాయాన్ని శంకించినట్లయితే అందుకు దగిన వుపాయాన్ని ఊహించుకోవచ్చును గనుక, యిలాటి వాళ్ళవల్ల చిక్కే లేదేమో అనిపిస్తుంది. ఉన్న చిక్కల్లా మనుషుల్లో మనుషులుగా కలిసి సంచరించేవాళ్ళతోనే!

బస్సులో నేనింకా జోగుతుండగానే సూర్యోదయమై వుంటుంది. వేడెక్కిపోతున్న యింజన్ని మంచినీళ్ళతో శాంతింప జేయడానికి, వేడి (కాకపోతే ఉత్సాహం) తగ్గిపోతున్న శరీరానికి టీ నీళ్ళతో వుషారెక్కించడానికి డ్రయివరూ కండక్టరూ బస్సును మార్గమధ్యంలో ఎన్నిసార్లు ఆపారో నాకు తెలియదు. సడన్ బ్రేకుతో కలిగిన కుదుపువల్ల ఓ లావుపాటి

మనిషి నా పైనపడి, ఆ తాకిడికి నా తలకమ్మీకి మోదుకోవడంతో నీరెండలో నీరసించి మాయమైన మంచులా నా నిద్ర మటుమాయమైంది.

పట్టణంలో అయిదు గంటలకు బయలుదేరిన బస్సొకటి, అక్కడ మాబస్సుతో తారసిల్లింది.

"ఈ రోజు కాస్త లేటుగా వస్తున్నావు" అన్నాడు మా బస్సు డ్రయివరు.

ఆ బస్సులో కూచున్న డ్రయివరు కంగారుతో తబ్బిబ్బయిపోతున్నాడు.

"లేటు సంగతలా వుండనీగానీ నేనిక్కడ ఒక పాసెంజరును దింపేస్తున్నాను. సీటు వున్నా లేకపోయినా నువ్వతణ్ణి ఎక్కించుకోవాలి."

"ఏం, ఎందుకూ?" ఆశ్చర్యంతో ప్రశ్నించాడు మా బస్సు డ్రయివరు.

"తీరిగ్గా చెబుతూ కూచోడానికి టైంలేదు పాపం, ఈ ఆదమరచిన పెద్దమనిషి క్షణంలో వెయ్యి రూపాయలు పోగొట్టుకున్నాడు."

"వెయ్యి రూపాయలే! ఏం జరిగింది? ఎలా పోయింది?" డ్రయివరుతో బాటు ఐదారు మంది ఏక కంఠంతో ప్రశ్నించారు.

"ఆ దొంగ వెధవగూడా ఈయనతో బాటే టౌనులో బస్సెక్కాడు. గ్రహచారమేమిటంటే ఈయన చేతిలో వున్న లెదర్ బ్యాగులాంటిదే వాడిచేతిలోనూ వుంది. మసక చీకట్లో వాడేం ట్రిక్ చేశాడోగాని చల్లగా వాడి సంచిని ఈయన దగ్గరుంచి, ఈయన సంచిని చేతబట్టుకొని యిరవై అయిదో మైల్లో నాలుగు రోడ్లు కూడలి దగ్గర బస్సు దిగేశాడు. బస్సు ముప్ఫయ్యోమైలు రాయి దాటుకునేదాకా ఈయనగా రానంగతి తెలుసుకోలేకపోయారు."

"అయ్యయ్యో, ఆ తరువాతేం జరిగింది?"

"జరగడానికేముంది? లబోదిబోమంటూ నన్నిక్కడే దింపేయి, వాడిని వెంటాడతానన్నాడు. 'అయ్యా మహానుభావా, కాలినడకతో వాడిని వెంటాడితే నీ డబ్బు నీకు దొరికినట్టే! అలా కాకుండా యిక్కడ దిగేసి బస్సుకోసం వెయిట్ చేస్తావనుకో! తీరా, ఆ బస్సులో సీటు దొరక్కపోతే ఏం చేస్తావు? అలాకాదు. ఈ బస్సులోనే యింకొక నాల్గైదు మైళ్ళు రా. మా కంపెనీ బస్సే ఒకటి ఎదురుగా వస్తుంది. నిన్ను దాన్లో ఎక్కించేస్తాను' అన్నాను."

"అలాగా! ఇప్పుడేడీ అతను?" అంటూ మా బస్సు డ్రయివరు కూర్చున్న తావులోనే సర్దుకుని వెనుదిరిగాడు. అతనితో బాటు బస్సులో వున్న ప్రయాణికులందరూ ఆ వైపుకు చూపులు మళ్ళించారు.

చెమటలో ముఖం దొప్పదోగుతుండగా, భుజంపైన అంగ వస్త్రం క్రిందికి జారిపోతుండగా వేడి వేడి నిట్టూర్పులతో అస్సురుస్సుమంటూ ఓ నలభై ఏళ్ళ వ్యక్తి బస్సులో కెక్కుతున్నాడు.

ఉత్సవంలో బిడ్డను ధారబోసుకుని జుట్టు వీడిపోతుండగా, పమిట సవరించుకోవడం సైతం మరిచిపోయి, పరుగునా బారునా జన సమూహంలో కలయ తిరిగేస్తున్న తల్లిని గనుక వూహించుకున్నట్లయితే ఈ పెద్ద మనిషి ముఖంలోని దైన్యాన్ని ప్రత్యేకంగా వివరించవలసిన పని వుండదు.

అతడు సీటు కోసం అటూ యిటూ చూడకుండా దబేలున క్రింద కూర్చున్నాడు. తలపైన చేతులుంచుకుని డ్రయివరుకేసి చూస్తూ "వెళ్ళవే బాబూ! వేగంగా వెళ్ళనీ నాయనా!" అని వేడుకున్నాడు.

బస్సు కదిలింది.

శరవేగంతో పరుగిడుతున్న బస్సులో అతడిపైన ప్రశ్నల వర్షం కురవసాగింది.

"ఐతే, అతడు సంచీ మార్చేస్తున్నప్పుడు మీరు నిద్రపోయారన్న మాట?"

"పోనీగానీ, అతడు బస్సు దిగుతున్నప్పుడైనా మీరు మీ చేతనున్న సంచిలో డబ్బుందో లేదో చూసుకోలేకపోయారా?"

"ఇంతకూ ఆ మనిషి ఎలావుంటాడండీ?"

"నన్నేమీ అడక్కండి బాబూ! నన్నేమీ అడక్కండి." అరిచాడనడంకన్నా అతడు ఆక్రోశించాడనడం సమంజసం.

బస్సు పదిహేను నిముషాలు ఏక ధాటిగా పరుగులు తీసింది. ఆలోపల ఎవరో అతడికి ఆసన సదుపాయం సమకూర్చారు కానీ అతడు తన తావులో నిశ్చలంగా కూర్చోలేకపోయాడు. అలాగని లేచి నిల్చోనూలేకపోయాడు. నడుము విరిగిన వాడికి మల్లే నిటారుగా కూచోనూ లేక, లేచి నిలబడనూ లేక అతడు కాసేపు కిటికీలోంచీ తలదూర్చి పరిసరాల్ని గాలిస్తాడు. మరి కొంతసేపు డ్రయివరువైపు వంగి అద్దంలో నుంచీ రోడ్డుపైకి చూస్తాడు. చిత్రమేమిటంటే అతడితో బాటే ప్రయాణికులందరూ నిలువెల్లా కళ్ళు చేసుకున్నారు. ఒకరి తల మరొకరికి అడ్డురాకుండా ఒక్కొక్కరూ ఒక్కొక్క భంగిమలో ముందుకూ, వెనక్కూ, పక్కకూ వంగి యింతకుమునుపు తమకు ముఖపరిచయమైనా లేని వ్యక్తికోసం కనుచూపు ప్రసరించినంతమేరకూ వెదికేస్తున్నారు.

కానీ, యిరవై అయిదోమైలు దగ్గర ఎక్కడో బస్సుదిగిన మనిషి, పొలాల పైన బడి అడ్డదారి పట్టివుండవచ్చు. లేదా అది నాలుగు రోడ్లకూడలి గనుక, మరొక రోడ్డువెంట ఈపాటికెప్పుడో పలాయనమంత్రం పఠించివుండవచ్చు. కానీ, ఈ అనుమానం ఎవరికీ కలిగినట్టులేదు. ఇప్పుడో మరికొంత సేపటికో ఆ దొంగ చేజిక్కిపోవడమే ఖాయమని అందరూ విశ్వసిస్తున్నారు.

అందుకుతోడూ డ్రయివరుగూడా భరోసా యిస్తున్నాడు.

"మాదర్చేద్! వాడెక్కడికి వెళ్ళగలడండీ? మీరొక పనిమాత్రం చేయాలి. ఇలాగే రోడ్డుపైకి చూస్తూవుండి, వాడింకా ఒక ఫర్లాంగు దూరంలో వుండగానే హింట్ ఇచ్చేయండి. ఆ తరువాత వాడి సంగతి నేను చూస్తాను."

డ్రయివరు అన్నంతపని చేసేటట్టుగానే వున్నాడు. దుష్టశిక్షణకుగానీ, శిష్టరక్షణకుగానీ, అంత పట్టుదలగా పనిచేసే మనుష్యులు నలుగురైదుగురుంటే ఇక లోకంలో అన్యాయాలే జరగవనిపించింది.

బస్సు యిరవయ్యారో మైలురాయి దాటింది.

"దగ్గరికి వచ్చేస్తున్నాం! జాగ్రత్త!" వెనుకనుంచీ కండక్టరు కేకవేశాడు.

నిమిష నిమిషానికీ ప్రయాణీకులు అనిమిషనయనులై పోతున్నారు. అప్రమత్తులైపోతున్నారు. డబ్బు పోగొట్టుకున్న ఆసామి పైన అనుకంప, కాజేసిన దొంగపైన ఆగ్రహం ఈ రెండు భావాలే వాళ్ళ ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా పరిణమించాయి.

నిశ్చల కాసారంలో రాయిపడి, కొలను కొలనంతా తరంగ కల్లోలితమై పోయిన తరువాత పైకి లేచిన నీటి బుడగలా అప్పుడొక కేక వెలువడింది "అదిగో, వాడే, వాడే, దొంగ!"

"మీరు కూచోండి, కూచోండి" అంటూ నలుగురైదుగురు ప్రయాణీకులు ఆ పెద్దమనిషి భుజాలపైన, తలపైన చేతులుమోపి క్రిందికి అదిమేశారు.

"ఆ వైపు చూచించి చాలు! అందరూ ఇటు తిరిగి కూచోండి." అంటూ కండక్టరు కాషన్ యిచ్చాడు. దగ్గరలో ఆపడానికి వీలుగా డ్రయివరు బస్సువేగం తగ్గించాడు.

బస్సు సరిగ్గా నాలుగురోడ్ల కూడలిలోనే ఆగింది. లెదర్ బ్యాగు చేతబట్టుకుని చెట్టు క్రిందనుంచీ పరుగిడివచ్చిన వ్యక్తి కంగారుగా చేతిని అడ్డంగా చాపి "ఇదే వూరి బస్సు?" అన్నాడు.

కానీ కండక్టరు అతడి ప్రశ్నకు తీరిగ్గా సమాధానం చెబుతూ కూచోలేదు. బస్సు దగ్గరికి రాగానే అతణ్ణి రెక్కపట్టుకుని ఒక్క వుదటున లోపలికి ఈడ్చేశాడు.

అతడు పాతికేళ్ళ యువకుడు. సన్నగా పొడుగ్గా, నల్లగా, ఎముకలగూడు లాంటి మనిషి, చప్పిడి దవడలు, ఎత్తయిన ముక్కు, బహుశా అతడు తన పొడుగాటి శిరోజాలను వెనక్కు దువ్వుకునేవాడేమో! బస్సులో బోరగిలబడి అతడు తలపైకెత్తేసరికి ఆ వెంట్రుకలన్నీ ఎటు వీలైతే అటు చెదరిపోయి పెద్ద బుట్టలాగా తయారయ్యాయి.

అతడు బొత్తిగా నాకు అపరిచితుడు. కానీ అతడి ముఖం మాత్రం ఎన్నడో కలలో కనిపించినట్టు నాకొక విచిత్ర భావన కలిగింది. బహుశా ఆ ముఖం (కాకపోతే అలాంటి ముఖం) నాకు రైల్వేస్టేషన్లలోనూ పెద్ద పెద్ద పోస్టాఫీసుల్లోనూ వ్రేలాడే పటాల్లో కనిపించేదేమో ఇప్పుడు నిర్ధారణగా చెప్పలేను.

అతడు తలపైకెత్తి పరిస్థితిని అవగతం చేసుకోడానికి ప్రయత్నించాడు. కానీ, ఆ అవకాశం లభించేలోగానే అతడి తలపైన నాలుగైదు మొట్టికాయలు పడ్డాయి. చుట్టూరా ప్రోగైన ప్రయాణీకులు అతడి వీపుపైన వీలైనన్ని పిడిగుద్దులు ప్రసాదించారు. బస్సు లోపలిభాగం మరీ ఇరుకై పోవడం తమ ప్రహరణోత్సవం అత్యంత విజయవంతం కావడానికి వీల్లేపోయింది.

బస్సులో ఓ వైపున గలాటా జరుగుతుండగా, పైకం పోగొట్టుకున్న పెద్దమనిషి, ఏ సందులోనో గానీ తన లెదర్ బ్యాగును చేజిక్కించుకున్నాడు. ఓ మూలగా కూర్చుని సంచిని తెరిచి చూచాడు. అతడి ముఖం హర్షప్రఫుల్లమైపోయింది. వెంటనే అతడు సంచిని మూసేశాడు. మూసేస్తూ "కొట్టకండి బాబూ! మీకు పుణ్యముంటుంది, అతణ్ణి వదిలేయండి" అంటూ పైకిలేచాడు.

"వదిలి పెట్టడమా! వీణ్ణి! ఊరుకోండి సార్, వూరుకోండి. ఈ రోజు వదిలి పెడితే మళ్ళీ రేపీపాటికి ఇలాటి వ్యవహారమే మరొకటి జరుగుతుంది. మీరు మౌనంగా కూచోండి. నేను వీణ్ణి తీసుకెళ్ళి పోలీసు స్టేషనులో పడదోస్తాను." అన్నాడు డ్రయివరు.

"ఎందుకు బాబూ! వద్దు. మన డబ్బు మనకు దొరికింది. అంతేచాలు." ఆ పెద్దమనిషి డ్రయివరుకు నచ్చజెప్పసాగాడు "ఈ రోజు లేవగానే ఎవరి ముఖం చూచానో నా అదృష్టం మంచిది. నేను నా కుమార్తె పెళ్ళికోసం నగలు తాకట్టు పెట్టి డబ్బు తీసుకెళ్తున్నాను. కేసు పోలీసుదాకా వెళ్తే విచారణ పూర్తయ్యేవరకూ డబ్బు నా చేతికి రాదు. పెళ్ళికి అంతరాయం కలుగుతుంది. దయచేసి నన్ను నిర్బంధించకండి" అంటూ అతడు సంచిలో నుంచి మూడు పదిరూపాయల నోట్లను పైకి తీశాడు. ఒకటి డ్రయివరు కిచ్చాడు. మరొకటి కండక్టరు కిచ్చాడు.

ఇంకొకటి ఎవరికిస్తాడా అని అందరూ డైలమాలో పడ్డారు.

ఆయన యింకా ప్రయాణీకుల పాదాల ముందు బోరగిలపడివున్న యువకుణ్ణి లేపి కూచోబెట్టాడు. అతడి కళ్ళలోకి నిశితంగా చూస్తూ "ఈ రోజు నువ్వు నిద్రలేచిన వేళ గూడా మంచిది! లేకపోతే మరికొంతసేపటికి కమ్ములోపలికి నడిచి వుండేవాడివి. ఈ రోజు తప్పించుకున్నావు. రేపు గూడా తప్పించుకోవచ్చు. కానీ ఏనాటికైనా పట్టుబడడం తథ్యం. ఇదిగో, నీకు నేను పదిరూపాయలిస్తున్నాను. ఇకమీదట ఎన్నటికీ యిలాటి పని చేయవద్దని హెచ్చరిస్తున్నాను. ఆ తరువాత నీ యిష్టం" అని నోటును అతడి జేబులో వేసి గబగబా బస్సు దిగేశాడు.

డ్రయివరూ, కండక్టరూ, ప్రయాణీకులూ అందరూ తెల్లబోయారు.

"అందరికీ నమస్కారాలు బాబూ!" అంటూ ఆయన చేతులు జోడించాడు.

ఆయనపట్ల ప్రయాణీకులకున్న గౌరవ భావం ఆ క్షణాన ద్విగుణీకృతమైంది. డ్రయివరూ, కండక్టరూ తమకు దొరికిన బక్షీసుతో తృప్తిపడి మళ్ళీ తమ తమ కార్యక్రమాలలో నిమగ్నులయ్యారు!

* * *

తొమ్మిది, తొమ్మిదిన్నరకల్లా బస్సు గమ్యస్థానం చేరుకుంది. తోడి ప్రయాణీకులందరూ రోడ్డుకొకరుగా, వీధికొకరుగా చీలబారిపోయారు. పట్టణంలో నాకూ కాస్తా పని వున్న మాట నిజమే కానీ, అదేమంత తొందరపనిగాదు. అదీగాక, ఓ క్షణం పాటు అలా నిల్చోగానే తమ తమ పనులమీదుగా బస్సులు, సైకిళ్ళు, రిక్షాలు, జట్కాలు లాంటి వాహనాలమీద వందలూ వేలుగా కదలిపోయే మానవులు ప్రత్యక్షమయ్యే పట్టణాల్లో, అప్పుడే పల్లెటూరి నుంచి వచ్చి బస్సు దిగినవాడు, తన స్వంత పనిని విస్మరించడంలో అసహజమేమీలేదు!

పది పదిహేను నిమిషాలపాటు నేను శరీరానికి సౌఖ్యదాయకంగా వున్న చలికాలపు టెండలో నిల్చుని బస్సు స్టాండులో వినోదాన్ని చూస్తూ వుండిపోయాను.

'ఏమండీ! సార్!' ఎవరో పిలిచారు. వెనుదిరిగి చూచాను. అతడు మరెవరోగాదు, దొంగతనానికి సూర్యోదయాత్పూర్వమే లగ్నం కుదుర్చుకున్న దురదృష్టవంతుడు!

నాకు మహదాశ్చర్యం కలిగిన మాట వాస్తవం. దెబ్బలతో సొమ్మసిల్లి బస్సులో పడిపోయిన తర్వాత యింతసేపటి కతడికి తెలివొచ్చిందేమో ననుకున్నాను. అతడు కళ్ళు మూసుకోలేదు. తలవాల్చలేదు. కాని ఆ కళ్ళలో జీవం లేదు. ఆ ముఖంలో చలనం లేదు. ఎన్ని తిట్లు, ఎన్ని పరిహాసాలు, ఎన్ని ఈసడింపులు! త్రోవపొడుగునా అతడికి దేహశాంతి జరుగుతూనే వచ్చింది. ఐనా అతడు కదల్లేదు, మెదల్లేదూ! కళ్ళూ, చెవులూ, నోరూలేని దౌర్భాగ్యుడికి సైతం కనీసం స్పర్శజ్ఞానమైనా వుంటుంది. వీడి కదీలేదనిపించింది!

అలాటివాడు నన్ను పిలుస్తున్నాడు!

'ఏమిటి? ఎందుకూ?' అంటూ తెల్లబోయాను. అతడు దగ్గరకు రమ్మన్నాడు. కానీ నేనింకా తటపటాయిస్తుండగానే అతడే నన్ను సమీపించాడు.

అతడితో ఎలా మాట్లాడాలో తోచక అప్రయత్నంగా "ఏం కావాలి?" అన్నాను.

"ఏమీ వద్దండీ! మీ రొక్కరైనా నిజం తెలుసుకోగలిగితే చాలు" అన్నాడతడు.

"నిజమా! కళ్ళకు కనిపించింది నిజం కాదేమిటి?" అన్నాను.

"కాదు బాబూ! అది నిజంగాదు. దైవసాక్షిగా చెబుతున్నాను. నేనే పాపమూ ఎరుగను." నా ముఖంలో కరడుగట్టుక పోయిన అనుమానపు నీడల్ని పసిగట్టాడేమో, అతడు నా చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ అడిగాడు. "చెప్పమంటారా బాబూ?"

చేసేది లేక చెప్పమన్నాను. అతడు ప్రారంభించాడు:

"ఉదయం అయిదు గంటలకు బస్సెక్కాను."

"ఎక్కడికి పోదలచి?" ఆదిలోనే హంసపాదులా అడ్డు తగిలాను.

"ఊళ్ళో మా అమ్మ వుంది. ఆ నాలుగు రోడ్లు కలిసేచోట దిగి రామాపురం నుంచీ బొమ్మసముద్రం వెళ్ళే బస్సెక్కితే పదో మైల్లోనే మా వూరు."

"ఐతే, నువ్వు మీ వూరికి వెళ్ళదలచుకున్నావన్నమాట?"

"నేను గనుక నెలకు పదిరూపాయలు పంపిస్తే మా అమ్మ తింటుంది. లేకుంటే పస్తులు మాడుతుంది. నేను మా వూరెళ్ళి నాలుగైదు నెలలయింది. వెళ్ళి దబ్బిచ్చి, రెండు రోజులుండి వద్దామనుకున్నాను."

"అన్నట్టు, నువ్విక్కడ చేసే పనేమిటీ?" అన్నాను. అతడు వళ్ళు వంచి పని చేయకుండా కేవలం హస్తలాఘవం వల్లనే బ్రతుకుతున్నాడేమో అని నా అనుమానం.

"ఇక్కడ మెటల్ ఫ్యాక్టరీలున్నాయి గదండీ! ఎక్కడ కూలీ దొరికితే అక్కడ పనిచేస్తాను. రోజుకు రూపాయి కూలీ దొరుకుతుంది. ఆ కూలీ డబ్బులు నాకే చాలవు. అందుకని రెండు నెలలుగా ఓ టాకీసులో గేటు దగ్గర వుంటున్నాను. వాళ్ళు నెలకు పదిహేను రూపాయలిస్తున్నారు. రాత్రుల్లో నిద్రలేక ఆరోగ్యం బాగా చెడిపోయింది. రెండు రోజులు వూళ్ళో వుండి, తలంటుకుని కళ్ళారా నిద్రపోయి వద్దామనుకున్నాను..."

"ఆగుతావెందుకు, చెప్పు?" అన్నాను యించుక ఆసక్తిని కనబరుస్తూ.

"రెండో ఆట విడిచేసరికి అర్ధరాత్రి దాటింది. ఆ తరువాత పడుకున్నా సరిగ్గా నిద్రపట్టిందిగాదు. నాలుగున్నరకంతా బస్సుస్టాండుకు వచ్చేశాను. బస్సు కదలగానే నిద్రపట్టింది. కండక్టరు కేకలువేసి నాలుగురోడ్ల కూడలి దగ్గర దింపేశాడు. దిగిందొకటి మాత్రమే నాకు జ్ఞాపకం. ఆ నిద్రమత్తులో నా చేతికి దొరికిన లెదరు బ్యాగు నాదౌనో కాదో నేను చూసుకోలేదు. బస్సు రావడానికి ఓ గంటసేపు పడుతుంది. అందాకా కూచోడమెందుకని బండపైన పడుకున్నాను..."

"ఐతే, ఈ బస్సుకడ్డంగా చేయి చాపా వెందుకూ?" అతని కథకూ ఈ సంఘటనకూ పొత్తు కుదరగలదని నేననుకోలేదు. కేవలం కట్టు కథయితే అతడెక్కడ బోల్తాపడక తప్పదనుకున్నాను.

"తీరా దగ్గరికి వచ్చేదాకా బస్సుశబ్దం వినిపించింది గాదు. ఉలికిపడి లేచాను. ఇదే బొమ్మ సముద్రం బస్సనుకుని అడ్డంగా చేయి చాపాను." అతడు కాసేపు మౌనంగా వుండి "ఆ తరువాత జరిగిన కథ మీకు తెలుసు" అన్నాడు.

కాసేపక్కడే నిల్చుని ఆలోచించాను. ఆలోచిస్తూనే బస్సుస్టాండునుంచీ ఈవలికి వచ్చాను. హోటలు వరండాలో నిల్చునిగూడా ఆలోచించాను. ఈ కథ ఈ విధంగాగూడా జరిగివుండడానికి అవకాశం వుందా అన్న ప్రశ్నకు ఎంత సేపాలోచించినా సమాధానం స్ఫురించింది కాదు. ఎందుకోగానీ నాకా యువకుడి నిర్దోషిత్వం మీద హఠాత్తుగా నమ్మకం కలిగింది. ఎందుకు కలిగింది? అకారణంగా కలిగివుండదు కదా?

ఆఖరుకు కారణం వేడివేడిగా కాఫీ త్రాగిన తర్వాత స్ఫురించింది. అవును అతడి నిర్దోషిత్వానికి దీన్ని రుజువుగా అంగీకరించవచ్చు. అతడు నిజంగా దొంగే అయితే బస్సు దిగగానే పారిపోకుండా ఆ నాలుగు రోడ్ల కూడలిలో ఎందుకు తామసిస్తాడు?

బురదనీటిలో సూర్యబింబం ఎలాగైతే ప్రతిఫలించదో, అలాగే విభ్రాంత చేతస్కులకు ముంజేతి కంకణంలాంటి సత్యంగూడా స్ఫురించదు గాబోలు!

కాఫీగ్లాసును టేబిల్‌పైన వుంచీ బిల్లు తీసుకుని పైకి లేచాను.

అరవ పత్రిక చదువుకుంటున్న అయ్యరు డబ్బుకోసం చేయి చాపాడు.

జేబులో నుంచీ చిల్లర తీస్తుండగా బిల్లులు, రసీదుల్లాంటి కాగితాలతో బాటు ఓ అయిదు రూపాయలనోటు క్రిందికి జారింది.

"డబ్బు విషయంలో జాగ్రత్తగా వుండాలి సార్! కాలం బొత్తిగా చెడిపోతూ వుంది" అన్నాడు అయ్యరు.

'చెడిపోతున్నది కాలమా, మనుషులా?" అన్నాను.

"రెండూ ఒకదానితో ఒకటి పందెం వేసుకుని చెడిపోతున్నాయనుకోండి! అంతెందుకు? నిన్నటికి నిన్న వర్తమానం వినండి. ఓ పొరుగూరి ఆసామి మండీలో బాకీ చెల్లించడానికి వెయ్యి రూపాయలు తీసుకొచ్చాడు. అతడు నేరుగా మండీకే వెళ్ళిపోయివుంటే బాగుండేది. మధ్యలో హోటలుకు వెళ్ళాడు. లెదర్ బ్యాగు ఒడిలోనే వుంచుకొని టిఫిన్ చేశాడు. చేతులు కడుక్కోడానికి టబ్ దగ్గరికి వెళుతూ బ్యాగును కుర్చీపైన వుంచాడు. అతడు ఒక్క నిమిషం ఆదమరిచాడేమో, అంతే సంచీకి సంచే మాయమైపోయింది!"

అయ్యరు మాటల్ని వింటూ నేను చేష్టలు దక్కి విగ్రహంలా నిల్చుండి పోయాను.

అలా ఒకటి రెండు నిమిషాలు నిల్చుండిపోయిన తర్వాత నా బుర్రలో ఓ మెరుపు మెరిసింది. బస్సులో తాత్కాలికంగా డబ్బు ధారబోసుకున్న పెద్ద మనిషి కేసును పోలీసులదాకా తీసుకెళ్ళడానికి నిరాకరించినందుకు కారణమిదేనేమో!

ఏమో! నిజం దేవుడికి తెలుసు. నీటికి పల్లం తెలుసు. ఆలోచించిన కొద్దీ మనకు కలిగేవి సందేహాలు మాత్రమే!

♦ ఆంధ్రసచిత్ర వారపత్రిక - 1959 ♦